కుమ్మేసింది..

▶ మొదటిపేజీ తరువాయి

పద్మాకాలనీ పక్కనే ప్రవహిస్తున్న రామ్‌నగర్ నాలా పొంగి పద్మాకాలనీని ముంచెత్తింది. దీంతో ఇళ్లల్లోకి నీరు చేరాయి. ముషీరాబాద్ డివిజన్‌లోని ఆదర్శకాలనీ మొత్తం వర్షపు నీటితో డ్రైనేజీ పొంగిపొర్లి ఇళ్లల్లోకి నీరు చేరాయి. దీంతో ఇళ్లల్లోని నీరు ఎత్తిపోయలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, వీఎస్‌టీ, విద్యానగర్, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై వచ్చి చేరడంతో ట్రాఫిక్‌కు, విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది.

◆ అంబర్‌పేట నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన ప్రాంతాలైన ఛే నంబర్ చౌరస్తా, మహంకాళి ఆలయం, చెన్నారెడ్డినగర్, బాపూనగర్, పటేల్‌నగర్ చౌరస్తా, ముసారాంబాగ్ బ్రిడ్జి, గోల్నాక గంగానగర్, శారదానగర్, బతుకమ్మకుంట, రత్నానగర్, సత్యానగర్ తదితర ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరడంతో రోడ్లన్నీ చెరువును తలపించాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు

◆ పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. దీంతో రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనాలు ముందుకు సాగలేకపోయాయి. ఛత్రినాక, ఉప్పుగూడ, గౌలిపురా, పటేల్‌నగర్, లలితాబాగ్ రైల్వే బ్రిడ్జి, యాకుత్‌పురా, డబీర్‌పురా తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచింది. డబీర్‌పురాలో డ్రైనేజీ నిండిపోవడంతో మురుగునీరు రోడ్లపైకి పొంగి పొర్లింది. డబీర్‌పురా ఫర్హత్‌నగర్ ఫిలక్‌మాత దేవాలయం పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు పలు ఇక్కట్లకు గురయ్యారు.

ఖైరతాబాద్ వద్ద..

◆ హబ్సిగూడ ప్రాంతంలో రోడ్లు జలమయం అయ్యాయి. దాదాపు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

◆ మల్లాపూర్, నాచారం, ఇసిఐఎల్, కాప్రా, కుషాయిగూడ, చర్లపల్లి, బోడుప్పల్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

◆ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పరిధిలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరింది. పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ, నాగోలు, లింగోజిగూడ, హస్తినాపురం, చంపాపేట, వనస్థలిపురం డివిజన్ పరిధిలోఅత్యధిక వర్షం పాతం నమోదయింది. హస్తినాపురం డివిజన్‌లో శ్రీనగర్ కాలనీలో వర్షం నీరు ఇళ్లలోకి రావడంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పద్మనాయక్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసకున్నారు.

◆ కంటోన్మెంట్‌లోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. రోడ్లు నదులను తలపించేలా మారిపోయాయి. ముఖ్యంగా రామన్నకుంట పరిసర ప్రాంతాలు, తాడ్‌బండ్ చౌరస్తా, తిరుమలగిరి చౌరస్తా, మార్కెట్ చౌరస్తాల్లో ట్రాఫిక్‌జామ్ అయింది.

◆ చిలుకానగర్ శివాలయం వద్ద ఉన్నట్టుండి ఒక్కసారిగా హైటెన్షన్ వైర్లు తెగి పడ్డాయి. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కూలిన ప్రహరీ

విజయనగర్‌కాలనీ: వర్ష బీభత్సానికి శుక్రవారం రాత్రి ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ కిషన్‌నగర్‌లో ఓ ఫర్నీచర్ షాపు ప్రహరీ కూలిపోయింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దత్తాత్రేయ కాలనీవైపు ఓ భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనుల్లో భాగంగా బండరాళ్లను భారీ యంత్రాలతో తొలగిస్తుండగా..ఫర్నిచర్ దుకాణం పునాదులు కదిలాయి. దీనికి తోడు వర్షానికి పునాదులు ఒక్కసారిగా కూలిపోవడంతో అక్కడ పని చేస్తున్నవారు అప్రమత్తమై పారిపోయారు. దాదాపు రూ.5 లక్షల విలువైన ఫర్నీచర్ ధ్వంసమైనట్లు దుకాణం యజమాని అబ్దుల్ రహీం తెలిపారు.

నదీం కాలనీకి డీఆర్ఎఫ్ బృందాలను పంపండి: ఎంపీ అసద్ ట్వీట్..

భారీ వర్షానికి నిండా మునిగిన టోలీచౌకి నదీం కాలనీకి అత్యవసరంగా డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలని కోరుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. దీంతో రాత్రి 9 గంటల ప్రాంతంలో డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకొని అత్యవసరంగా సహాయక చర్యలు చేపట్టాయి.